క్లుప్తంగా

కోడి పందెం స్థావరాలపై దాడులు

వాకాడు: వాకాడు మండలం కొండూరుపాళెం సరుగుడు చెట్ల వద్ద నిర్వహించిన కోడిపందెం స్థావరాలపై ఆదివారం వాకాడు పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రఘునాథ్ తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

వృద్ధులకు దాతల చేయూత


ఆశ్రమ నిర్వాహకులకు నగదును అందిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు చెన్నైలో నివాసం ఉంటున్న శ్యామ్ కుటుంబసభ్యులు ఆదివారం చేయూత అందించారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు ఆదుకునేలా శ్యామ్ రూ.15 వేల నగదును స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు చేతులమీదుగా ఆశ్రమ నిర్వాహకులు సునీత, బెన్నీలకు అందించారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

తడ: గుండె, దంత సమస్యలపై తడలో ఆదివారం డాక్టర్ హేమంత్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. తడ స్టేట్ బ్యాంక్ సమీపంలోని ఆస్పత్రిలో నిర్వహించిన శిబిరంలో తడ చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున వచ్చిన వారికి డాక్టర్లు బాలకృష్ణ, హేమంత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు.

చర్చికి సీసీ కెమెరాల ఏర్పాటు


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ

వాకాడు: ఇటీవల పలు ఆలయాల్లో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం వాకాడు సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చిలో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చర్చి భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఎస్‌ఐ రఘునాథ్ తెలిపారు. అనంతరం ఎస్‌ఐను రఘునాథ్‌ను చర్చి కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. చర్చి కమిటీ చైర్మన్ వి. దినకర్ బాబు, సంఘకాపరి ప్రశాంత్‌బాబు, పిడుగు ప్రవీణ్‌కుమార్, వై.సుమంత్, భరత్ మహిపతి, సాల్మాన్, అజయ్‌కుమార్, రాజ్‌కుమార్, స్వామిదాస్ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ


బాలికలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

గూడూరు: రెండవ పట్టణంలోని నరశింగరావు పేట ప్రాంతంలోని బాలసదన్ చిన్నారులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. వల్లెపు కొండలరావు, చిన కొండలరావుల దాతృత్వంతో విద్యార్థినులకు చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని దుప్పట్లు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. అలాగే 1వ పట్టణంలోని శ్రీ సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజనం అందజేశారు. కొండలరావు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఆర్డీఓకు సత్కారం


ఆర్డీఓను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

గూడూరు: తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. మహతి కళాక్షేత్రంలో ఆదివారం మన సంస్కృతి కళా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ఆయన తన ప్రసంగం ద్వారా మన జానపద సంస్కృతి, సంప్రదాయాలు, కళారూపాలు, భక్తి పాటల ద్వారా వారి అనుభవాలను వారితో పంచుకున్నారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఆహ్వాన కమిటీ సభ్యులు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

కండలేరులో 52.978 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 52.978 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరు జలాశయానికి 550 క్యూసెక్కులు, హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,520, పిన్నేరు వాగుకు10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయీజ్‌కు 30, హైలెవల్ స్లూయీజ్‌కు 50, క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

సంక్షేమంలో ఆంధ్ర రాష్ట్రమే ప్రథమం


హాజరైన ఆరు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య

–సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: అభివృద్ధి, సంక్షేమంలో ఆంధ్ర రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమంలో నిలిపేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకెళుతున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. నాయుడుపేటలోని కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమీక్ష జరిగింది. ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీలన్నింటినీ ఆరు నెలల వ్యవధిలోనే 95 శాతానికి పైగా అమలు చేసిన ఘనత దక్కించుకుని తిరుగులేని నాయకుడుగా పేరు తెచ్చుకున్నారన్నారు. ప్రజలకు మేము మంచి చేసి ఉంటే తిరిగి వైఎస్సార్‌సీపీకి ఓటు వెయ్యండని ధైర్యంగా ప్రజల వద్దకు వెళుతున్నామని చెప్పారు., పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి పార్టీ జెండా తిరిగి రెపరెపలాడించాలని ఎమ్మెల్యే కోరారు. చంద్రబాబు తిరిగి చివరి అవకాశం ఇవ్వాలని, పవన్ ఒక్క చాన్స్ అంటూ ప్రజలకు మాయమాటలు చెబుతూ వస్తున్నారని ప్రజలు వీరిద్దరికి గుణపాఠం చెబుతారన్నారు. ముందుగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస్‌రెడ్డితో పాటు నాయకులకు పుష్ప గుచ్ఛాలు అందించి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే కిలివేటి ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌లు కటకం దీపిక, దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, అల్లూరు అనిల్ రెడ్డి, మారాబత్తిన సుధాకర్, పట్టణ అధ్యక్షుడు 786 రఫీ, కళత్తూరు శేఖర్‌రెడ్డి, జలదంకి వెంకటకృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, నేత బైనా మల్లికార్జునరెడ్డి, మద్దాలి సోమశేఖర్ రెడ్డి, కిషోర్ యాదవ్ చెంచయ్య, వేణు యాదవ్, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా నేదురుమల్లి పుట్టినరోజు వేడుక

నాయుడుపేట కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి పుట్టినరోజును వేడుకగా జరిపారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, నేతలు రామ్‌కుమార్‌రెడ్డిచే కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. నియోజవర్గంలోని పార్టీ నేతలు నేదురుమల్లిని శాలువలు కప్పి సత్కరించారు.

జగన్ ప్రభుత్వంలో పేదలకు రోజూ పండగే


నాయుడుపేటలో నేదురుమల్లికి కేక్ తినిపిస్తున్న మాజీ మంత్రి బాలినేని

- నేదురుమల్లికి శుభాకాంక్షల వెల్లువ
- తరలిన పార్టీ నేతలు, కార్యకర్తలు

వెంకటగిరి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పేద బడుగు వర్గాల ప్రజలకు పార్టీకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఆయన హయాంలో ప్రతిరోజూ పండుగ వాతావరణం నెలకొంటుందని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక నివాసంలో జన్మదినం సందర్భంగా వివిధ మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, తరలివచ్చి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సైదాపురం: ఆదివారం సైదాపురంలో పార్టీ నేతలు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

కోట: ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది కేక్‌కట్ చేసి నేదురుమల్లికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నేదురుమల్లి నివాసం వద్దకు చేరుకుని గజమాలతో రామ్‌కుమార్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వాకాడు: వాకాడు గ్రామ సచివాలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

పెళ్లకూరు: పెళ్లకూరులోని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు రామ్‌కుమార్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సంస్కృతిని భావితరాలకు అందజేయాలి


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: రంగవల్లులు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, వాటిని భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత మనకుందని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. రెండవ పట్టణంలోని సిరామిక్ కళాశాల ఆవరణలో వైఎస్సార్‌సీపీ నేతలు కోడూరు మీరారెడ్డి, కల్పలత, సిరామిక్ యూత్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతుల కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి హాజరయ్యారు. ప్రస్తుత నాగరిక ప్రపంచంలో మన సంస్కృతి, సంప్రదాయలు కనుమరుగయ్యే పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. ఈక్రమంలో కోడూరు దంపతులు ఇలాంటి పోటీలను సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేస్తూ, వాటిని నేటి యువతకు గుర్తుండిపోయేలా చేయడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ రంగవల్లుల ఏర్పాటుతో సృజనాత్మకశక్తి పెరుగుతుందన్నారు. డాక్టర్ రోహిణి, శ్రీకంటి రామ్మోహన్‌రావు, వాయుగండ్ల నాగరాజు, సీఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు


గర్భిణికి సూచనలు ఇస్తున్న వైద్యులు కల్యాణ్

చిల్లకూరు: ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తరువాత మారు మూల ప్రాంతాలకు కూడా వైద్య సేవలు అందుతున్నాయని వరగలి పీహెచ్‌సీ వైద్యులు కల్యాణ్ తెలిపారు. మండలంలోని లింగవరం గ్రామంలో ఆదివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో కలిసి దీర్ఘ కాలిక రోగులకు నెలకు సరి పడా మందులను అందించారు. అనంతరం సచివాలయంలో గర్భవతులను పరీక్షించి వారికి మందులు అందించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం శాంతకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ క్యాలెండర్ విడుదల


క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట: మండలంలో ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్‌టీఎఫ్ క్యాలెండర్‌ను సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతులమీదుగా విడుదల చేశారు. నాయుడుపేట కేఎంఆర్ కన్వెన్షన్ హాల్ ప్రాంగణంలో ఆదివారం క్యాలెండర్ విడుదల చేశారు. వైఎస్సార్‌టీఎఫ్ మండల అధ్యక్షుడు చిప్పల అల్లెయ్య క్యాలెండర్లను ముద్రించి ఉపాధ్యాయులకు పంచి పెట్టారు. ఎమ్మెల్యేతోపాటు కలికి మాధవరెడ్డి, అనీల్‌కుమార్‌రెడ్డి, చదలవాడ కుమార్, జెట్టి వేణు, పేర్నాటి రాహుల్, భావన్ అనుదీప్, ఓట్టూరు కిషోర్‌యాదవ్, కటకం జయరామయ్య, నాగార్జున పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతపై దృష్టి సారించాలి



చిల్లకూరు: నేటి సమాజంలో యువత సాంకేతికతపై మక్కువ చూపుతునప్పటికీ ఆధ్యాత్మికత వైపు కూడా దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ నేతలు బత్తిన విజయకుమార్ పిలుపునిచ్చారు. కమ్మవారిపాళెం గ్రామంలో 1896లో జర్మన్‌లు నిర్మించిన పాత చర్చిని ఆదివారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా సంంఘ కాపరి బి.విజయకుమార్ దైవ సందేశం అందించారు. సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చి కార్యదర్శి ఎం. నిర్మల పాత చర్చిని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఎస్ఏఎల్‌సీ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ వి దినకర్‌బాబు, చర్చి కౌన్సిల్ సభ్యుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిలివేటికి సన్మానం


ఎమ్మెల్యే కిలివేటి, మండల కన్వీనర్ సుబ్రహ్మణ్యంరెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న నేతలు


నాయుడుపేటటౌన్: సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డిలను పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. నాయుడుపేటలో ఎమ్మెల్యే నివాసం వద్ద ఆదివారం భారీ కేక్‌ను సంజీవయ్యచే కట్ చేయించి ముందస్తుగా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు తంబిరెడ్డి మధుసూదన్ రెడ్డి, బాలరామిరెడ్డి, బైనా మల్లికార్జున రెడ్డి, కటకం జయరామయ్య, వి.సుధాకర్ రెడ్డి, గురుమూర్తి, కరుణాకార్‌రెడ్డి, హరి, రవీంద్ర, ఏ శ్రీనివాసులు, కే రాజేష్, రవీంద్రరెడ్డి, సురేష్ రెడ్డి, సర్పంచ్ సుమతి, రమణయ్య, రఘు హాజరై ఎమ్మెల్యేతో పాటు సుబ్రహ్మణ్యంరెడ్డిని శాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం


పోటీలను ప్రారంభిస్తున్న సీఐ దశరథరామారావు

గూడూరు: సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రగతి సేవా సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని రూరల్ సీఐ దశరథరామారావు పేర్కొన్నారు. సంస్థ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా పట్టణ సమీపంలోని హెచ్‌డీ ఎరీనా ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఏ–1 గ్రేడ్ కేటగిరికి చెందిన క్రీడాకారులకు టోర్నమెంట్స్‌ను ఆయన ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు కే చంద్రశేఖర్, సీనియర్ క్రీడాకారులు శ్రీహరి, నాగేంద్రరెడ్డి, కలాం ఇంతియాజ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నూతన కమిటీకి అభినందనలు


నూతన కమిటీని అభినందిస్తున్న సభ్యులు

నాయుడుపేట: సూళ్లూరుపేట డివిజన్లోని గ్రామ రెవెన్యూ అధికారులకు తిరుపతి జిల్లా కమిటీలో సముచిత స్థానం దక్కడంతో నూతన కమిటీకి ఆదివారం అభినందనలు వెల్లువెత్తాయి. తిరుపతి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడిగా సీహెచ్ మనోజ్‌కుమార్ (నాయుడుపేట), కార్యదర్శిగా జి. మురళీక్రిష్ణ (నాయుడుపేట), జాయింట్ సెక్రటరీగా ఎన్ భార్గవ్(డీపీ సత్రం), కార్యవర్గ సభ్యులుగా ఈసీ దిల్లెయ్య(ఓజిలి) ఏకగ్రీవంగా ఎంపిక కావడంపై గ్రామ రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఉద్యోగులు అభినందించారు.

శాఖాహారంతో అనారోగ్య సమస్యలు మాయం


ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ జనార్దన్‌రెడ్డి, రోహిణి దంపతులు

గూడూరు: శాఖాహారాన్ని తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలు చాలా వరకూ మటుమాయం అవుతాయని డాక్టర్ జనార్దన్‌రెడ్డి, రోహిణి వెల్లడించారు. రెండవ పట్టణంలో టీటీడీ కల్యాణ మండపంలో బుద్ధ పిరమిడ్ ధ్యాన ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన యోగా సద్భావన ర్యాలీని డాక్టర్ జనార్దన్‌రెడ్డి దంపతులు ప్రారంభించారు. పిరమిడ్ ధ్యాన మందిరం సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు మెమెంటోల అందజేత


బహుమతులు అందజేస్తున్న పేర్నాటి, డీఎస్పీ

చిట్టమూరు: చిట్టమూరు మండలంలో వివేకానంద చారిటబుల్ ట్రస్టు చేస్తున్న సేవలు అభినందనీయమని తూర్పు రాయల సీమ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కొత్తగుంట గ్రామంలో నిర్వహించిన వివేకానంద చారిటబుల్ ట్రస్టు 10వ వార్షికోత్సవానికి ముఖ్యులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రస్టు తరపున 100 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతితో పాటు మెమెంటో అందజేశారు. అలాగే ప్రతి సంవత్సరం అందజేసే పేద మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీఅధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేతలు కామిరెడ్డి కస్తూర్ రెడ్డి, చిల్లకూరు కోదండరామిరెడ్డి, టీఎమ్మార్ విద్యా సంస్థల అధినేత తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి, ట్రస్టు చైర్మన్ షేక్ రహంతుల్లా, సాయిసేవా సమితి అధ్యక్షుడు రమణయ్య పాల్గొన్నారు.

ఎంఈఓ వర్సస్ ఉపాధ్యాయుడు

- డిప్యూటేషన్ ఆదేశాలు బేఖాతర్

పెళ్లకూరు: 46మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులున్న పాఠశాల నుంచి 26మంది విద్యార్థులు, సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలకు డిప్యూటేషన్ విషయమై నెల రోజులుగా ఎంఈఓ వర్సస్ ఉపాధ్యాయుడు మధ్య వివాదం నెలకున్న ఘటన పెళ్లకూరు మండలం, పాలచ్చూరు క్లస్టర్ పరిధిలో చోటుచేసుకుంది. ఎంఈఓ సుబ్రమణ్యం, ఉపాధ్యాయుడు బాలసుబ్రమణ్యంల మధ్య డిప్యూటేషన్ విషయమై వివాదం రగులుతోంది. పాలచ్చూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1–5తరగతుల వరకు 46మంది విద్యార్థులకుగాను ముగ్గురు ఉపాధ్యాయులు బోధన సాగిస్తున్నారు. అలాగే యడపూడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 26మంది విద్యార్థులకుగానూ సింగిల్ టీచర్ బోధన చేస్తున్నారు. నిబంధనలు ప్రకారం 21మంది విద్యార్థుల కంటే అధికంగా ఉన్న పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు బోధన చేయాలి. ఒక పోస్ట్ సర్‌ప్లస్ కావడంతో పాలచ్చూరు క్లస్టర్ కింద జూనియర్ మోస్ట్ బాలసుబ్రమణ్యంను యడపూడికి డిప్యూటేషన్ వెళ్లాలని డీఈఓ శేఖర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. అయితే డీఈఓ కార్యాలయ ఆదేశాల జీఓ కాపీని గత ఏడాది డిసెంబర్‌లో స్థానిక ఎంఈఓ సుబ్రమణ్యం పాలచ్చూరు పాఠశాలకు జారీ చేశారు. అయితే ఎంఈఓ సంతకం చేసిన వ్యక్తిగత జీఓ కాపీని మాత్రమే తీసుకుంటానని, డీఈఓ జారీ చేసిన నకలు కాపీని తీసుకోనంటూ భీష్మించారు. దాంతో ఎంఈఓ తన సిబ్బంది కలిసి నేరుగా పాఠశాలకు చేరుకుని జీవో కాపీని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణకు అందించే ప్రయత్నం చేశారు. హెచ్‌ఎం రామకృష్ణ అదే ఉపాధ్యాయ సంఘంలో సభ్యులు కావడంతో యూనియన్ అధ్యక్షుడు తీసుకోవద్దంటున్నారని తిరస్కరించారు. ఇరువురి మధ్య నాలుగు గంటల పాటు హైడ్రామ చోటుచేసుకుంది. చివరకు జీఓ కాపీని తీసుకున్న ఉపాధ్యాయుడు బాలసుబ్రమణ్యం అప్పటి నుంచి పనిచేస్తున్న పాఠశాలకు హాజరవుతూ డిప్యూటేషన్ పాఠశాలకు వెళ్లడం లేదు. నెల రోజులుగా అటు ఉపాధ్యాయుడు ఇటు ఎంఈఓపై అంటే సైఅంటూ వార్ కొనసాగిస్తున్నారు. ఆఖరికి యడపూడి పాఠశాలలోని1–5తరగతులకు గాను 26మంది విద్యార్థులతో ఒకే ఉపాధ్యాయుడు బోధన చేస్తున్నాడు. డిప్యూటేషన్ జీఓ కాపీని తీసుకున్నప్పటికి యడపూడి పాఠశాలకు వెళ్లడం లేదని ఈవిషయమై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఎంఈఓ వివరణ ఇచ్చారు.

పొగమంచు ఇక్కట్లు


జాతీయ రహదారిపై పొగమంచు కురుస్తుండడంతో లైట్లు వెలుగులో ప్రయాణిస్తున్న వాహనాలు


పొలాలపై కురుస్తున్న పొగమంచు

ఓజిలి: మండలంలో రాత్రి ఉష్ణోగ్రతలు పూర్తిగా తగ్గిపోతున్నాయి. 20 డిగ్రీల కంటే తక్కువగా నమోదు అవుతుండడంతో చలితో ప్రజలు వణికిపోతున్నారు. సాయంత్రం ఐదు గంటలకే చలి మొదలై మంచుకురుస్తోంది. ఉదయం పది గంటలు అయినా చలి తగ్గకపోవడంతో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు, పిల్లలు, వృద్ధుల పరిస్థితి మరింత ఘోరంగా మారింది. చలి నుంచి కొంత మేర ఉపశమనం పొందేందుకు చలి మంటలు వేసుకుంటున్నారు. పొగమంచు ఎక్కువగా ఉండడంతో రోడ్లు కనబడకపోవడంతో వాహనాలు లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్నాయి. గ్రామాల్లోని సాధారణ రోడ్లు, ఇళ్లు సైతం పొగమంచుతో కప్పివేయడబడుతున్నాయి.